క్లుప్తంగా

పోసాని కృష్ణమురళి అరెస్టు అక్రమం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: సినీనటుడు పోసాని కృష్ణమురళి అరెస్టు అక్రమమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజక వర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రాజాంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేవలం కక్ష సాధింపులో భాగంగా ఈ అరెస్టులు జరుగుతున్నాయని మండిపడ్డారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రభుత్వం అమలుచేస్తోందని, సూపర్ సిక్స్‌ను పక్కన పెట్టేసి, పేదల బతుకులతో ఆడుకుంటోందని ధ్వజమెత్తారు. భవిష్యత్‌లో వీటికి తగిన మూల్యం చెల్లించుకోవల్సిన పరిస్థితి కూటమికి తప్పదన్నారు.

కొట్లాటపై కేసు నమోదు

సంతకవిటి: రాజాం పట్టణంలోని ఓ ఐటీ కాలేజీ మెయిన్ గేట్ దగ్గర గురువారం సాయంత్రం జరిగిన కొట్లాటకు సంబంధించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.గోపాలరావు శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని రెండు వర్గాల మధ్య నెలకొన్న పాత కక్షల కారణంగానే గొడవ జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో పలువురు గాయాలపాలై ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. మంతి గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై.. ఆస్పత్రి స్టేట్‌మెంట్, రౌతు తేజ ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇరువర్గాలూ ఒకరికొకరిపై ఫిర్యాదు చేసుకున్నారని పోలీసులు చెబుతున్నారు.

నిధులు కేటాయించకపోవడం దుర్మార్గం

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రభుత్వ ఉద్యోగులను తీవ్ర నిరాశపరిచిందని ఏపీటీఎఫ్(1938) జిల్లా అధ్యక్షుడు ఎం.బలరాంనాయుడు విమర్శించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌లో ఉద్యోగుల వేతన సవరణకు సంబధించి, ఎటువంటి నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అస్సలు పట్టించుకోకపోవడం చూస్తే ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఎంత నిర్లక్ష్యమో ఇట్టే అర్థమైపోతోందన్నారు. 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల డిమాండ్ పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తెర్లాం: రైతులు సాగు చేస్తున్న వరి పంటను ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి జి.సునీల్ కుమార్ సూచించారు. మండలంలోని నందిగాం గ్రామంలో పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. స్థానిక రైతులు సాగు చేస్తున్న వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంటను ఆశిస్తున్న తెగుళ్లను గుర్తించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వరి పంటను అగ్గితెగులు, పీక పురుగు ఆశిస్తుందని, వీటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వినియోగించాలని కోరారు.

వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వే పరిశీలన

బాడంగి: మండలంలోని కోటిపల్లి, వాడాడ గ్రామాల్లో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో జరుగుతున్న వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వేను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సర్వే నిరుద్యోగుల పాలిట వరం లాంటిదని, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగుల వివరాలను సర్వేలో సేకరించడం జరుగుతోందన్నారు.

ఘనంగా టైలర్స్ డే

రాజాం: పట్టణంలో వాసవీ క్లబ్ వనితాశక్తి ఆధ్వర్యంలో టైలర్స్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత 15 ఏళ్లుగా రాజాంలోని పలువురు యువతులకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్న బత్తుల జయలక్ష్మి అనే టైలర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్.కన్యాకుమారి, కె.అరుణ, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వితరణ

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రెడ్డి అప్పలనాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారులు రెడ్డి సురేష్, రమేష్‌లు పదో తరగతి విద్యార్థులకు అట్టలు, జామెట్రీ బాక్సులు శుక్రవారం వితరణ చేశారు. విద్యార్థులంతా బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని దాతలు ఆకాంక్షించారు.

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కెంబూరు అక్కలనాయుడు కుమారుడు తిరుమలరావు అట్టలు, పెన్నులు వంటి విద్యా సామగ్రి వితరణ చేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹100	₹170	180

- రహదారి పనుల్లో నాణ్యతా లోపం
- డివైడర్ నిర్మాణంలో నాసిరకం మెటీరియల్ వినియోగం
- నిర్మించిన వెంటనే ఊడిపోతున్న సున్నం
- డ్రైనేజీ పనుల పరిస్థితి అంతే..
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం

నాణ్యత డొల్ల!


రోడ్డు నిర్మాణం చేయకముందే నాసిరకంగా నిర్మించిన డివైడర్లు


డోలపేట చెక్‌పోస్ట్ వద్ద పాత కల్వర్టుపైనే కొత్త రోడ్డుకు లైనింగ్ వేసిన దృశ్యం

రాజాం: పట్టణ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో నాణ్యతపై ప్రజలకు అనుమానాలు రోజురోజుకూ బలపడుతున్నాయి. అసలు నాణ్యతతో నిర్మిస్తున్నారా లేకుంటే ఎలాగో ఒకలా పని కానిచ్చేద్దామని చేసేస్తున్నారా అనే సందేహాలు అందరి నుంచి వ్యక్తమవుతున్నాయి. నిన్నమొన్నటి వరకు రాతిగ్రావెల్ నిర్మాణంతో రోడ్డుని అధికారులు లైనింగ్ చేశారు. ప్రస్తుతం రోడ్డు మధ్యలో డివైడర్ల నిర్మాణం చేస్తున్నారు. వీటి ఎత్తు గతంలో శ్రీకాకుళం రోడ్డులో నిర్మించిన ప్రధాన రహదారి మధ్యలోని డివైడర్ల కన్నా తక్కువగా ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. అంతేకాకుండా అప్పట్లో అక్కడి డివైడర్లు రహదారి నిర్మాణం అనంతరం ఏర్పాటు చేశారు. ఇక్కడ అలా కాకుండా రహదారి బీటీ నిర్మాణం కాకముందే డివైడర్లు నిర్మిస్తున్నారు. వీటిని కూడా ఇలా నిర్మిస్తున్నారో లేదో అలా వాటి సున్నం ఊడిపోతోంది. వాటిని కప్పి పెట్టేందుకు సిమ్మెంట్ ఒంద్రుతో ప్లాస్టింగ్‌లు కూడా చేస్తున్నారు. డివైడర్ల నిర్మాణంలో నాణ్యతా లోపం స్పష్టంగా కనిపిస్తున్నా వాటిని కప్పిపుచ్చేందుకు ప్లాస్టింగ్‌లు చేస్తున్నారని అటువైపుగా ప్రయాణించే వారంతా విమర్శిస్తున్నారు.

అంతా అస్తవ్యస్తం..

రాజాంలో అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ఐటీ వరకు, బొబ్బిలి కూడలి నుంచి గాయత్రి కాలనీ వరకు నిర్మిస్తున్న రహదారిలో పనులు అంతా అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన డ్రైనేజీ పలకలు ముందుగానే ఊడిపోతున్నాయి. కొంతమంది వ్యాపారులు తమ సొంత డబ్బులతో బలమైన కాంక్రీట్ పలకలు వేయించుకుంటున్నారు. డ్రైనేజీ పలకలే ఇంత లోపభూయిష్టంగా ఉంటే, గోడల నిర్మాణం ఇంకెంత ప్రమాదకరంగా ఉందో, ఈ డ్రైనేజీ మన్నిక ఎన్నాళ్లు ఉంటుందోనన్న ప్రశ్న తలెత్తుతోంది. శ్రీకాకుళం రోడ్డులో తొలి విడతలో చేసిన రహదారి విస్తరణలో విద్యుత్ స్తంభాలు డ్రైనేజీకి వెలుపల ఉండగా, ఇప్పుడు జరుగుతున్న విస్తరణలో ఈ స్తంభాల ఏర్పాటు అందుకు భిన్నంగా రోడ్డు మీదికే వచ్చేస్తున్నాయి. దీంతో రోడ్డు విస్తరణ జరిగినా ట్రాఫిక్ సమస్య తప్పదన్నట్లుగా పలువురు ఆరోపిస్తున్నారు.

పాత కల్వర్టులపైనే లైనింగ్..

రాజాం ప్రధాన రహదారి రెండో విడత విస్తరణకు గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా జరుగుతున్న ఈ పనుల్లో ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణా లోపం, అలసత్వం స్పష్టంగా కనిపిస్తోంది. డోలపేట చెక్‌పోస్ట్, జీఎంఆర్ఐటీ కళాశాల వద్ద, గాయత్రి కాలనీ సమీపంలోని అండర్ డ్రైనేజీలకు కల్వర్టులు కొత్తగా నిర్మించలేదు. పాత ఇరుకు కల్వర్టుల మీదగానే రోడ్డు నిర్మాణానికి లైనింగ్ పనులు పూర్తి చేశారు. డోలపేట చెక్‌పోస్ట్ వద్ద గతంలో ఉన్న కల్వర్టు ఇరుకుగా ఉండడంతో వర్షాల సమయంలో వరదనీరు రోడ్డుమీదకు వచ్చి ప్రమాదకరంగా మారుతోంది. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంటుందని, అధికారుల పర్యవేక్షణా లోపమే ఇందుకు కారణమని పలువురు మండిపడుతున్నారు. రహదారి విస్తరణ పనుల పర్యవేక్షణ చేయాల్సిన ఆర్అండ్‌బీ డీఈఈ.. పనుల నాణ్యతను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పనులు వేగవంతం చేయాలనే ఒత్తిడితోనే ఇబ్బడిముబ్బడిగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని, ఈ నిర్మాణ పనులు గాలివాటంగా మారుతున్నాయని, నాణ్యత లేదని స్థానికులు వాపోతున్నారు. రహదారి నిర్మాణంపై ఆర్అండ్‌బీ డీఈఈ బి.వరప్రసాదరావు వద్ద సాక్షి ప్రస్తావించగా, రహదారి పనులను పర్యవేక్షణ చేస్తున్నామని, నాణ్యత ప్రమాణాలపై క్వాలిటీ అధికారులతో చెక్ చేయిస్తామన్నారు.

గట్టితనం కనిపించడం లేదు..



రాజాం ప్రధాన రహదారి విస్తరణలో నాణ్యత గట్టిగా ఉన్నట్లు కనిపించడం లేదు. ఈ విషయాన్ని చాలామంది బాహాటంగానే విమర్శిస్తున్నారు. లోపాలు వేలెత్తి చూపితే ఇబ్బంది పెడతారనే ఉద్దేశంతో ప్రశ్నించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. నిర్మాణంలోనే డివైడర్లు, డ్రైనేజీ పలకలు ఊడిపోవడం నాణ్యత లేదనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

బి.ప్రసాద్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు

నాణ్యత లేకుంటే ఊరుకోం..



గత ప్రభుత్వం తొలివిడత రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఉండేలా చేయించింది. ఇప్పుడు కూడా ఈ రోడ్డు విస్తరణలో నాణ్యత ఉండేలా, అవసరమైన చోట భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని గట్టి నిర్మాణాలు చేయాలి. మూడు జిల్లాలకు అనుసంధానంగా ఉన్న ఈ రహదారి నిర్మాణంలో నాణ్యత లోపిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు.

–డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాజాం

• ధర్నా



పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై రాజాం మున్సిపల్ కార్యాలయం వద్ద వారు శుక్రవారం ధర్నాకు దిగారు. 100 మందికి పైగా కార్మికులు ఉండాల్సి ఉన్నా కేవలం 58 మందితోనే పని చేయిస్తున్నారని, దీంతో ఉన్న కార్మికులపై పని ఒత్తిడి, భారం పెరిగిందన్నారు. మృతి చెందిన కార్మికుల స్థానంలో కొత్త వారిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ రామ్మూర్తినాయుడు, పి.లక్ష్మి, కె.అనిల్‌కుమార్, గురువులు, బాలరాజు, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు. –రాజాం సిటీ

• పితృదేవతార్చన



వంగర మండలం, సంగాంలోని పవిత్ర పుణ్య క్షేత్రం సంగమేశ్వరస్వామి దేవస్థానం వద్ద పితృదేతార్చన శుక్రవారం చేపట్టారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇక్కడ జరుగుతున్న జాతరకు ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి వస్తున్న భక్తులు ఇక్కడి త్రివేణి సంగమం(నాగావళి, వేగావతి, సువర్ణముఖి నదులు కలిసిన ప్రదేశం)లో పుణ్యస్నానాలు ఆచరించి, తమ పితృదేవతలకు పిండప్రదానం చేశారు. ఇక్కడ ఇలా చేస్తే తమ వారికి స్వర్గప్రాప్తి కలుగుతుందన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. –వంగర

• ముక్కు మూసుకోవాల్సిందే..



వంగర మండలం, అరసాడ గ్రామంలో పారిశుధ్య లోపం కనిపిస్తోంది. ఏ వీధి, రోడ్డు, కాలువ చూసినా చెత్తాచెదారంతో నిండిపోయాయి. మురుగునీటితో కాలువలు ఉండడంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా కాలువల పక్కన ఉన్న రోడ్లపై వెళ్తుంటే దుర్వాసన వెదజల్లుతోందని, ముక్కు మూసుకుని మరీ వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి, పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు. –వంగర

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి

జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని, పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం చేపట్టిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. సందర్శనకు విచ్చేసిన అధికారులకు తమ ప్రాజెక్టుల గూర్చి విద్యార్థులు క్షుణ్ణంగా తెలిపారు. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని, విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీసేందుకు ఈ తరహా విజ్ఞాన ప్రదర్శనలు దోహదం చేస్తాయని అధికారులు అన్నారు. ప్రతి విద్యార్థి శాస్త్రవేత్త కావాలని, ఆ దిశగా ఆలోచనలు, ఆవిష్కరణలు చేయాలని ప్రోత్సహించారు. అనంతరం ఉత్తమ ప్రయోగాలుగా గుర్తించిన వాటికి బహుమతులు అందజేశారు. అంతకుముందు భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. –బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


రాజాం సిటీ: ఎంఈవో ప్రవీన్‌కుమార్‌కు ప్రాజెక్టుల పనితీరు వివరిస్తున్న విద్యార్థులు


రాజాం: పెనుబాక పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న హెచ్‌ఎం మహేశ్వరరావు


సంతకవిటి: సైన్స్ ప్రాజెక్టులతో విద్యార్థులు


రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రయోగాలను తిలకిస్తున్న ఎంఈవో ప్రసాదరావు


బొబ్బిలి: ప్రాజెక్టుల గూర్చి అధికారులకు వివరిస్తున్న విద్యార్థులు


బాడంగి హైస్కూల్‌లో విద్యార్థుల ప్రయోగాల గూర్చి తెలుసుకుంటున్న ఎంఈవో రాజేశ్వరి తదితరులు


విద్యార్థులకు సూచనలిస్తున్న డిప్యూటీ ఈవో మోహనరావు


బొబ్బిలిరూరల్: నారసింహునిపేట ఉన్నత పాఠశాలలో సైన్స్ డే నిర్వహిస్తున్న దృశ్యం


తెర్లాం: పెరుమాళి మోడల్ స్కూల్‌లో సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంఈవో త్రినాధరావు తదితరులు

పరామర్శ


గంగరాజును పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్, ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

రాజాం: వంగర మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పుర్రి లక్ష్మణరావుతో పాటు ఆయన కుమారుడు గంగరాజును పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శుక్రవారం రాజాంలో కలిసి పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గంగరాజుకు రాజాంలోని సన్‌రైజ్ ఆస్పత్రిలో డాక్టర్ రాజేష్ చికిత్స అందించారు. తండ్రీకొడుకులిద్దరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ ఉన్నారు.

రాల్కో పరిశ్రమ వద్ద ఉద్రిక్తత


కంపెనీ వద్ద బయట ఉన్న కార్మికులు, ఇతరులు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గ్రోత్ సెంటర్‌లో గల రాల్కో పరిశ్రమ వద్ద శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. పాత, కొత్త యాజమాన్యాల మధ్య నెలకొన్న గొడవతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. సీఐ కె.సతీష్ కుమార్, ఎస్సై ఆర్.రమేష్‌లు తమ సిబ్బందితో కలసి పరిశ్రమ వద్ద మోహరించారు. పాత యాజమాన్యం కంపెనీ పేరు మీద రుణాలు తీసుకుని చెల్లించకపోవడంతో కొన్నాళ్ల కిందట కంపెనీని ఎన్‌సీఎల్‌టీ స్వాధీనం చేసుకుని వేలం నిర్వహించింది. ఈ వేలంలో ఒడిశాకు చెందిన ఓ పారిశ్రామిక వేత్త రూ.9.60 కోట్లకు కొనుగోలు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిసింది. తనకు సమాచారం ఇవ్వకుండా వేసిన వేలం చెల్లదని పాత యజమాని కోర్టును ఆశ్రయించారు. ఇది తప్పుడు రిజిస్ట్రేషన్ అని కోర్టు ధ్రువీకరిస్తూ తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో గత పారిశ్రామిక వేత్త కొందరు మనుషులతో వచ్చి పరిశ్రమను ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తూ, కార్మికులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కంపెనీ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఎస్సై రమేష్ మాట్లాడుతూ కోర్టు తీర్పువాస్తవమేనని, కానీ పాత యాజమాన్యాన్ని కంపెనీ వీడి వెళ్లాల్సిన తీర్పును కోర్టు ఇవ్వాల్సి ఉందని, దీనికి సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు కూడా ఆదేశాలొస్తాయని చెప్పారు. కోర్టు ఆదేశాలొస్తే కొత్త యాజమాన్యాన్ని ఖాళీ చేయించాల్సి ఉంటుందన్నారు. అంతవరకూ కంపెనీ వద్ద శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రీసర్వేకు సహకరించండి

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో భూముల రీసర్వేపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. రీసర్వే ద్వారా కలిగే ప్రయోజనాలను తహసీల్దారు ఎం.చిన్నారావు వివరించారు. ప్రస్తుతం గ్రామంలో సర్వే జరుగుతోందని, ప్రతీ రైతు సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్వే డీటీ ఈశ్వరరావు, మండల సర్వేయర్ అప్పలనాయుడు, సర్పంచ్ గోవిందరావునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్విజ్ పోటీలు

వంగర: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్విజ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. అరసాడ ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్.లోకేశ్వరి, ఎం.మోక్ష, ఎల్.ఇందుమతిలు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరంతా మార్చి 1వ తేదీన జరగనున్న జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం రమణమ్మ తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ఎంఈవో–1 ప్రవీన్‌కుమార్, ఎంఈవో–2 జగదీశ్వరిలు అభినందించారు.

సంక్షిప్తంగా...

నేటి నుంచి పాడి పశువులకు టీకాలు

బొబ్బిలిరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో పాడి పశువులకు శనివారం నుంచి టీకాలు వేస్తున్నట్లు పిరిడి పశువైద్యాధికారి సుధాకర్ శుక్రవారం తెలిపారు. ఈ నెలాఖరు వరకు జరిగే ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధుల నివారణకు వ్యాక్సిన్లు వేస్తున్నామన్నారు. పాడిరైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300

వంగర: నిర్దేశిత కొలతల ప్రకారం ఉపాధి హామీ పథకం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీవో మఠ్రాపు సత్యవతి తెలిపారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని, మెడికల్ కిట్లు కూడా పని ప్రదేశంలో ఉంచాలని సూచించారు.

రేగిడి: మండలంలోని లింగాలవలస, చిన్నలింగాలవలస, తోకలవలస తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో ఎస్.హరనాథరావు పరిశీలించారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి


మినపగుళ్లు ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ నారాయణ

వంగర: బ్యాంకుల ద్వారా అందించిన వివిధ రకాల రుణాలతో స్వయం సహాయక సంఘాల మహిళలంతా ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్రకాశం జిల్లా డీఆర్‌డీఏ పీడీ(వారం రోజుల పాటు విజయనగరం జిల్లాకు ట్రైనింగ్ పీడీగా వచ్చిన) టి.నారాయణ ఆకాంక్షించారు. మండలంలోని కొప్పర గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని, స్వయం సహాయక సంఘాల మహిళలు నెలకొల్పిన యూనిట్లను పరిశీలించారు. అనంతరం సంఘాల వారీగా సభ్యులు తీసుకున్న రుణాలు, నెలకొల్పుతున్న యూనిట్లు, లాభాలు, జీవనోపాధులపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రి, రాజాం ఏరియా కో–ఆర్డినేటర్ ఎ.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురంలో పీఎంఈజీపీ పథకం ద్వారా నాగవరపు శ్రావణి నెలకొల్పిన డెయిరీ యూనిట్‌ను ప్రకాశం జిల్లా డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణరావు శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఉన్నత స్థాయికి మహిళలు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

రామభద్రపురం: పదో తరగతి పరీక్ష కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని పరీక్ష కేంద్రం చీఫ్ ఎస్.రామారావు తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో–2 పెంటయ్య, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నాగభూషణరావుతో కలిసి శుక్రవారం సందర్శించి, ఏయే వసతులు ఉన్నాయి.. కల్పించాల్సిన వసతులేంటి అనే వాటిపై చర్చించారు. ఈ నెల 3వ తేదీన పరీక్ష ప్రశ్నాపత్రాలు పోలీస్‌స్టేషన్లకు చేరుకునే అవకాశం ఉన్నందున ట్రంక్ పెట్టెలు సిద్ధం చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. బెంచీలు, తాగునీరు, ఫ్యాన్లు ఉండేలా చూడాలన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈవో త్రినాధరావు సూచించారు. మండలంలోని జగన్నాధవలస గ్రామ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు, విద్యార్థుల చేతిరాత, హోమ్‌వర్క్ పుస్తకాలు, అభ్యసన సామర్థ్యాలు తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం వంటకాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలన్నారు. రుచి, శుచి కలిగిన భోజనాలు అందివ్వాలన్నారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదుకు స్పెషల్ డ్రైవ్ శుక్రవారం నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ డ్రైవ్‌లో ఐదేళ్ల వయసులోపు చిన్నారులకు కొత్తగా ఆధార్ కార్డులు చేసినట్లు డిజిటల్ అసిస్టెంట్ పార్వతి తెలిపారు. ఇప్పటివరకు 45 మంది చిన్నారులకు కొత్త ఆధార్‌లు చేశామన్నారు.

రాజాం సిటీ: గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని ఎంజేవలస గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. చిన్నారుల కొత్త ఆధార్ చేయడంతో పాటు మార్పులు చేర్పులు కూడా సరిచేసుకోవాలని తెలిపారు.